క్లుప్తంగా

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు


ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

బేతంచెర్ల : పట్టణంలోని సుమేధా ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో బుధవారం సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. బాలికలు తమకు కేటాయించిన స్థానంలో రంగు, రంగుల ముగ్గులు వేశారు. అనంతరం విద్యార్థినులకు స్కూలు కోఆర్డినేటర్ విజయనాగరాజు, హెచ్ఎం మహేశ్వరి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

తిరుమలకు గోవింద మాలధారులు


గోవింద మాలధారులకు వీడ్కోలు పలుకుతున్న ప్రధాన అర్చకులు

డోన్ : స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం 40 మంది గోవింద మాలధారులకు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ, రాము శర్మ ఇరుముడి కట్టారు. వీరందరూ తిరుమలకు బయలుదేరారు. ఈనెల 10వ తేదీన తిరుమలలో వైకుంఠ ఏకాదశి నాడు స్వామి వారి మహాద్వార దర్శనం చేసుకోనున్నారు. మాలధారులకు బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు ఘనంగా వీడ్కోలు పలికారు.

సన్మానం


పురస్కారం అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లె: మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జేఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారికి బుధవారం విజయవాడలోని గుణదల చెలిమి సాంస్కృతిక కార్యాలయంలో సంస్థ అధ్యక్షులు మహాత్మా జ్యోతిరావ్ పూలే సీసీ దర్శకుడు పీఎం సుందరావు ఘనంగా సన్మానించారు. వారి స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని బ్రహ్మానంద ఆచారి తెలిపారు.

వెంకటసుబ్బారెడ్డి ఎన్నికపై హర్షం


రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి

డోన్ టౌన్ : యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడిగా వరుసగా నాల్గవ సారి వెంకటసుబ్బారెడ్డిని ఎన్నుకోవడంపై ఆ సంఘం నాయకులతో పాటు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. కాకినాడ పట్టణంలో నిర్వహిస్తున్న ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 17వ విద్యా వైజ్ఞానిక స్వర్ణోత్సవ మహా సభల్లో వెంకటసుబ్బారెడ్డిని బుధవారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. డోన్ మండలానికి చెందిన ఈయనను యూటీఎఫ్ నంద్యాల జిల్లా గౌరవ అధ్యక్షుడు బీవై సుబ్బరాయుడు, డోన్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లక్ష్మీనాయక్, గోపాల్, సీనియర్ నాయకులు జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి తదితరులు ఫోన్ ద్వారా అభినందించారు.

బీసీ వసతి గృహం తనిఖీ


విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సహాయ సంచాలకులు ఓబులేసు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న బీసీ సంక్షేమశాఖ బాలుర వసతి గృహాన్ని డోన్ బీసీ సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఓబులేసు బుధవారం తనిఖీ చేశారు. మెనూను పరిశీలించారు. 18 మంది 10వ తరగతి విద్యార్థులు ఉండగా వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని వార్డెన్ నాగేంద్రకు సూచనలిచ్చారు. అనంతరం విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

బనగానపల్లె రూరల్: ఏపీటీఎఫ్ నూతన క్యాలెండర్లు, డైరీలను రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ బుధవారం ఆవిష్కరించారు. స్థానిక మంత్రి స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రావు, జిల్లా అధ్యక్షులు మాధవ స్వామి, ఉపాధ్యాయ సంఘం నాయకులు సుబ్బరాయుడు, గోవిందనాయక్, వెంకటకృష్ణుడు, రమేష్, పోలియో నాయక్, ఓబులేసు, వీరన్న, శేఖర్, చాంద్‌బాషా, మహమ్మద్‌రఫీ, శ్రీనివాసనాయక్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్లపై దండయాత్ర

- రేషన్ షాపులపై కూటమి నాయకుల కన్ను
- ఎలాగైనా దక్కించుకోవాలని రెవెన్యూ అధికారులపై ఒత్తిడి
- కార్యాలయాలు వదిలి దుకాణాలపై అధికారుల దాడులు
- ఏవేవో సాకులు చెబుతూ దుకాణాలు సీజ్ చేస్తున్న వైనం
- ఎలాంటి కేసులు రాశారో తెలియక ఆందోళనలో డీలర్లు


పట్టణంలోని 17వ రేషన్‌షాపులో తనిఖీ చేస్తున్న రెవెన్యూ అధికారులు

డోన్ : కూటమి నాయకుల కళ్లు రేషన్ షాపుపై పడ్డాయి. వాటిని ఎలాగైనా దక్కించుకోవాలనే ఉద్దేశంతో రెవెన్యూ అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు చేస్తున్నారు. వారి ఒత్తిళ్లకు తాళలేక రేషన్ షాపులపై దాడులు నిర్వహిస్తూ డీలర్లను వేధింపులకు గురిచేస్తున్నారు. సరైన కారణాలు చెప్పకుండా షాపులను సీజ్ చేస్తున్నారు.

పంచనామా చేయకుండానే సీజ్

డోన్ మండలంలో మొత్తం 72 రేషన్ షాపులు ఉన్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 44, పట్టణంలో 28 ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు డీలర్ షాపులను దక్కించుకోవాలని రెవెన్యూ అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తెస్తున్నారు. అధికారులు వారికి తలొగ్గి రేషన్ దుకాణాలను తనిఖీ పేరుతో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు నిత్యావసర సరుకులు అందకముందే ఎలాంటి కారణాలు చూపకుండా షాపులు సీజ్ చేస్తున్నారు. కార్డుదారులు వేయాల్సిన థంబ్ మిషన్లను డీలర్ల వద్ద నుంచి బలవంతంగా లాక్కొని వెళ్తున్నారు. తనిఖీ సందర్భంగా అధికారులు చట్టప్రకారం పంచనామా చేయాల్సి ఉంది. అలాంటి వేమీ లేకుండానే ప్రజలకు నిత్యావసర సరుకుల పంపిణీ చేయకముందే తనిఖీల పేరుతో కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారు. షాపుల ద్వారా ఇంకా సరుకులను పంపిణీ చేయాల్సి ఉన్నా అడ్డుపడుతున్నారని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా తమపై ఎలాంటి కేసులు నమోదు చేశారనే విషయం కూడా చెప్పకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.


డీలర్ నుంచి థంబ్ మిషన్‌ను స్వాధీనం చేసుకొని స్కూటర్ డిక్కీలో పెట్టుకున్న అధికారి


కార్డుదారులకు పంపిణీ చేయకుండా వాహనం నుంచి రేషన్‌ను దింపిస్తున్న అధికారులు

సక్రమంగా పంపిణీ చేయని వాటినే సీజ్ చేశాం

సక్రమంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేయని డీలర్ల దుకాణాలను తనిఖీ చేశాం. లోపాలను గుర్తించి సీజ్ చేశాం. వారి స్థానంలో ఇన్‌చార్జ్‌లను నియమించేందుకు ఇంకాస్త సమయం పడుతుంది. బలవంతంగా మిషన్లు లాక్కొని దుకాణాలకు తాళాలు వేస్తున్నామనడం వాస్తవం కాదు. త్వరలోనే ఇన్‌చార్జ్‌లను నియమించి రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేస్తాం. – నాగమణి, తహసీల్దార్, డోన్.

పంట మార్పిడితో తెగుళ్ల నివారణ


రైతులకు సూచనలిస్తున్న ఏఓ సుధాకర్ రెడ్డి

సంజామల: శనగ పంటలో వచ్చే తెగుళ్లను నివారించాలంటే పంట మార్పిడి తప్పనిసరి అని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. శనగ పంటలో ఎండు తెగులు నివారించాలంటే ఖరీఫ్ సీజన్‌లో కొర్ర, పెసర తదితర పంటలు వేయాలన్నారు. పంట మార్పిడి వల్ల తెగుళ్లు నివారించవచ్చన్నారు.

ఎల్‌సీడీసీ సర్వే పకడ్బందీగా చేయాలి


కుష్టువ్యాధి సర్వేపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: మండలంలో జరుగుతున్న ఎల్‌సీడీసీ(కుష్టు వ్యాధిగ్రస్తుల సర్వే) కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ మోనిక, డాక్టర్ చాణక్య నాయక్ సూచించారు. బుధవారం మండలంలోని పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎస్‌సీడీసీ సర్వేపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ఆరు నెలలకోసారి ఎల్‌సీడీసీ సర్వే చేపడుతుందన్నారు. 2030 నాటికి దేశంలో కుష్టువ్యాధిని పూర్తిగా రూపుమాపాలనేది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. సర్వే టీమ్ సభ్యులు వారికి కేటాయించిన కుటుంబాల్లోని ప్రతి ఒక్కరికి ఆరోగ్యపరీక్షలు నిర్వహించాలని, కుష్టు వ్యాధి అనుమానితులను గుర్తించి, వైద్యులను సంప్రదించేలా చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సుబ్బరాయుడు, ఎంపీహెచ్ఎస్ శారద పాల్గొన్నారు.

వ్యవసాయంలో నైపుణ్యం పెంచుకోవాలి


రైతుకు మందులు అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లె: వ్యవసాయంలో నైపుణ్యాలను పెంచుకుని పెట్టుబడులు తగ్గించుకోవాలని హైదరాబాద్‌కు చెందిన నార్మ్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో హరిజన ఉపప్రణాళికలో భాగంగా నార్మ్ ఆధ్వర్యంలో మేలైన యాజమాన్య చర్యలపై ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సహకారంతో రైతులు అధిక దిగుబడులు సాధించాలన్నారు. చీని, నిమ్మ తోటల్లో రైతులు ఎదుర్కొంటున్న వేరు కుళ్లు, పోషకలోపాల నివారణపై శాస్త్రీయ పద్ధతులను అవలంబించి పరిష్కరించుకోవాలని సూచించారు. యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ రమణయ్య మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడి అధిక దిగుబడుల గురించి వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు బాలరాజు, ఆదినారాయణ, ఏఓ సురేష్ పాల్గొన్నారు.

ఉల్లిగడ్డలు ఊరక..

- జలదుర్గంలో 50 ఎకరాల్లో పంట తొలగింపు
- నాసిరకం విత్తనాలతోనే నష్టపోయామంటున్న రైతులు


దెబ్బతిన్న ఉల్లిపంట

ప్యాపిలి: నాసిరకం విత్తనాల వల్ల ఉల్లి గడ్డలు ఊరక జలదుర్గం గ్రామంలో దాదాపు 50 ఎకరాల పంటను రైతులు తొలగించారు. వీరు కర్నూలు, అనంతపురం, డోన్ తదితర ప్రాంతాల్లో ఉల్లి విత్తనాలు తెచ్చి పంట సాగు చేశారు. గత కొద్ది రోజులుగా పైరు కళకళలాడుతుంటే మంచి దిగుబడి వస్తుందని సంతోషించారు. అయితే కోత దశలో ఉన్న పంటను తొలగించాలని చూడగా గడ్డలు లేక పోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. నాసిరకం విత్తనాల వల్ల తాము మోసపోయామని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. చేసేదేమీ లేక రైతులు పంటను తొలగిస్తున్నారు. తనకున్న రెండు ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేసి రూ. 2 లక్షల వరకు నష్టపోయానని రైతు తిమ్మారెడ్డి వాపోయాడు. విషయం తెలుసుకున్న ఉద్యానశాఖ అధికారిణి దెబ్బతిన్న ఉల్లిపంటను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఆమె తెలిపారు.

డబ్లింగ్ పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన


ప్రధాని ప్రసంగాన్ని తిలకిస్తున్న రైల్వే అధికారులు

డోన్ రూరల్ : దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బుధవారం విశాఖపట్టణంలో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆర్ఎస్ పెండెకల్-గుత్తి, డోన్ -మహబూబ్‌నగర్ రైల్వే డబ్లింగ్ పనులను వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. డోన్ పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రైల్వే సిబ్బంది,ప్రయాణికులు వీడియో ద్వారా కార్యక్రమాన్ని తిలకించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో చీడపీడల నివారణ


యాప్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ నిరంజన్

కోవెలకుంట్ల: పైర్లలో చీడపీడల నివారణకు కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. బుధవారం మండలంలోని రేవనూరు, ఉప్పలూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఓ మాట్లాడుతూ ఎన్‌పీఎస్ఎస్(నేషనల్ పెస్టిసర్వేలెన్స్ సిస్టమ్) యాప్‌లో పంటలను ఆశించిన పురుగులు, తెగుళ్లకు సంబంధించిన ఫొటోలు పంపితే పైరును ఏ పురుగు ఆశించింది, దాని నివారణ చర్యల గురించి రైతులకు సూచనలు అందుతాయన్నారు. రైతులు స్మార్ట్ ఫోన్‌లోని ప్లేస్టోర్ ద్వారా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి కృష్ణకుమార్ పాల్గొన్నారు.

గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి


గోకులం షెడ్డును పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఏపీడీ

బనగానపల్లె రూరల్: గోకులం షెడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని డోన్ క్లస్టర్ ఇన్‌చార్జ్ ఏపీడీ నరసింహారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం తమ్మడపల్లె, నందివర్గం, పాతపాడు, మీరాపురం గ్రామాల్లో పూర్తయిన గోకులం షెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 60 గోకులం షెడ్లు మంజూరయ్యాయన్నారు. అందులో ఇప్పటి వరకు 10 మంది రైతులు మాత్రమే నిర్మాణాలు పూర్తి చేసుకున్నారన్నారు. ఈనెల చివరిలోపు మిగతా వారు కూడా పూర్తి చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. బనగానపల్లె పొదుపు భవనంలో ఎన్ఈజీఎస్ క్షేత్ర సహాయకుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పనులకు కూలీలు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈసీ మక్బుల్, ఏపీఓలు రేష్మా, రవిప్రకాష్, సుబ్బన్న, టీఏలు ప్రసాదరెడ్డి,రవి రాంబాబు, సీఎల్ఆర్ అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): అంగన్‌వాడీ టీచర్‌పై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ కార్యాలయం నుంచి సాయిబాబానగర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ 15 సంవత్సరాల నుంచి సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న టీచర్ జయలక్ష్మిపై అదే గ్రామానికి చెందిన శివకుమార్ విచక్షణారహితంగా దాడిచేయడంతో కంటి చూపు పోయే ప్రమాదం ఉందన్నారు. ఏపీ అంగన్‌వా డీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు బుజ్జమ్మ, సార మ్మ, వరలక్ష్మీ, రాధాకృష్ణవేణి, అనురాధ పాల్గొన్నారు.

పనుల తీర్మాన ఆమోదానికి గ్రామసభ


మాట్లాడుతున్న సర్పంచ్ మెట్ల సరళ

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలో రాబోయే కాలంలో చేపట్టబోయే అభివృద్ధి పనుల తీర్మాన ఆమోదానికి సర్పంచ్ మెట్ల సరళ ఆధ్వర్యంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. స్వామినగర్ కాలనీలో రూ.20 లక్షలతో డ్రెయినేజీ, రూ.8 లక్షల అభివృద్ధి పనులు, సంతమార్కెట్ నుంచి బాలకృష్ణ ఆర్చీ వరకు డ్రెయిన్ విస్తరణ సీసీ రోడ్డు నిర్మాణం, హిందూ శ్మశాన వాటికలో ముళ్లపొదల తొలగింపు, పార్కు మెయింటెనెన్స్ పనుల నిర్వహణకు వేలం, సంత పేటలోని చౌడమ్మ ఆలయం నుంచి ఏడుకొప్పెర్ల బావి వరకు రోడ్డు విస్తరణ, డ్రెయినేజీ, తదితర పనులకు ప్రాధాన్యత క్రమంలో చేపట్టేందుకు పాలక వర్గం ఆమోదించింది. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, ఈఓ ప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు.

బాల ఆధార్ నమోదు చేయించాలి


ఆధార్ నమోదుపై సూచనలిస్తున్న సూపరింటెండెంట్ దస్తగిరిబాబు

బేతంచెర్ల : అంగన్‌వాడీ కేంద్రాల్లోని 0–6 సంవత్సరాల పిల్లలకు తప్పని సరిగా బాల ఆధార్ నమోదు చేయించాలని ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ దస్తగిరిబాబు సూచించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం అంగన్‌వాడీ వర్కర్లు, సచివాలయం సిబ్బందికి ఆధార్ నమోదుపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 0–6 సంవత్సరాల పిల్లల జనన ధ్రువీకరణ పత్రం, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు తీసుకొని వెళ్లి ప్రత్యేకంగా ఏర్పాటు నమోదు కేంద్రాలలో నమోదు చేయించాలని ఆదేశించారు. ఆధార్ నమోదు కోసం ప్రత్యేకంగా నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బేతంచెర్ల పట్టణంలోని 1,3 సచివాలయాలు, రంగాపురం 1 సచివాలయం, సీతారామాపురం సచివాలయాల్లో శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలి


హెచ్ఎంలకు టాయిలెట్ క్లీనింగ్ కెమికల్స్ అందిస్తున్న ఎంఈఓ రామనర్సప్ప

డోన్ టౌన్ : పాఠశాలలో బాత్ రూంలు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అంటు వ్యాధులు ప్రబలితే హెచ్ఎందే బాధ్యత అని మండల విద్యాధికారి– 2 రామనర్సప్ప అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పారిశుద్ధ్య పనులకు ఉపయోగించే పిచికారీ ద్రావణాలను బుధవారం ఆయన హెచ్ఎంలకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల పరిశుభ్రత కోసం ప్రభుత్వం డోన్ పట్టణంతో పాటు మండలంలోని ప్రభుత్వ యజమాన్య పాఠశాలలకు స్పెల్ 2 టాయిలెట్ కెమికల్స్ పథకం కింద పాఠశాల టాయిలెట్స్ నిర్వాహణ కోసం బాత్రూమ్ క్లీనర్స్ 8,806 లీటర్లు, టాయిలెట్స్ క్లీనర్స్ 10,945 లీటర్లు, ఎయిర్ ఫ్రెషనర్స్ 7,305 లీటర్లను కేటాయించినట్లు తెలిపారు. వీటిని సంబంధిత పాఠశాల హెచ్ఎంలు వచ్చి తీసుకెళ్లాలని సూచించారు.

నేడు బుగ్గానిపల్లెలో గ్రామసభ

బేతంచెర్ల : మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారంలో భాగంగా నిర్వహించే రీ సర్వే పై గురువారం మధ్యాహ్నం 3 గంటలకు గ్రామ రైతులతో సభ నిర్వహిస్తున్నట్లు రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. మండలంలోని బుగ్గానిపల్లె గ్రామాన్ని రీ సర్వే కోసం పైలెట్ గ్రామంగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. గ్రామసభకు ఆర్డీఓ నరసింహులు, తహసీల్దార్ ప్రకాశ్‌బాబు హాజరవుతారన్నారు.

రేపు నిజపాద స్పర్శదర్శనం

డోన్ రూరల్ : పట్టణంలోని శ్రీసుధ సీబీఎస్ పాఠశాల సమీపంలో, బాలాజీనగర్‌లో ఉన్న శ్రీ రుక్మిణీ పాండురంగస్వామి దేవాలయంలో ఈనెల 10వ తేదీ నిజపాద స్పర్శదర్శనం చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటల నుంచి దర్శనం ప్రారంభమతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

11 నుంచి క్రికెట్ పోటీలు

కొలిమిగుండ్ల: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మండలంలోని చింతలాయిపల్లెలో అంబటి శివశంకర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఈనెల 11 నుంచి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. చింతలాయిపల్లె పంచాయతీలోని నాలుగు గ్రామాల యువకులు మాత్రమే పోటీల్లో పాల్గొనాలన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు అంబటి గురివిరెడ్డి, సోదరుడు చంద్రమోహన్‌రెడ్డి మొదటిబహుమతి రూ.10 వేలు, ద్వితీయ స్థానం కై వసం చేసుకున్న జట్టుకు రూ.6వేలతోపాటు జ్ఞాపికను అందించనున్నట్లు చెప్పారు.